కానీ 'పురాణాలలో బూతు'ని సులభంగా నలుగురికీ అర్థమయ్యేట్టు వెలువరించిన కోలయ్యగారి నెందుకో మళ్ళీ విస్మరించారు. లక్ష్మణుడి పవిత్రత గురించి చర్చిస్తూ (125వ పేజీలో) లక్ష్మణుడు ఖచ్చితంగా సీతను చూసే వుండాలని తీర్మానించారు. అయితే అలాంటి Inherent contradictions ని గతంలో అనేకులు సూటిగా విమర్శించారు. "ఈ పురాణము లన్నియు వ్యాస నిర్మితము లందురు. పురాణము లన్నియూ ఒక్క వ్యాసుని చే వ్రాయబడినచో ఆయన ఇట్టి పిచ్చి వ్రాతలను వ్రాసియుండడు. రాముని అభిమానులు, స్వార్థులు, పరాన్నభుక్కులు, జాత్యహంకారులు మొదలుగా గలవారు యిట్టి తప్పుడు వ్రాతలు వ్రాసి వారి గౌరవ నాయకుడైన వ్యాసుని పేర వెలువరించిరి"—అని నాలుగు ముక్కల్లో వాస్తవాన్ని విమర్శ-రామాయణంలో తేల్చేశారు. దానికి వుదాహరణగా బ్రహ్మాండ పురాణంలో బ్రహ్మ రాముడై పుట్టినట్టుగానూ, స్కంధ పురాణంలో త్రిమూర్తులే రాముడై పుట్టినట్టుగానూ, నిర్వాణ ఖండంలో బ్రహ్మ రాముడనీ, ఆయనవల్ల త్రిమూర్తులు పుట్టారన్నట్టుగానూ, పద్మపురాణంలో సావిత్రి శాపం చేత విష్ణువు రాముడై పుట్టినట్టుగానూ చిత్రించబడిందని చెప్పారు. ఏమైనా "రామాయణ భారతాలైనా, అష్టాదశ పురాణాలైనా వాటి ప్రధానోద్దేశాలు కుల వ్యవస్థను పరిరక్షించటమే, ఫ్యూడల్ సంఘాన్ని సుస్థిరం చేయటమే' అనే శ్రీ నార్ల భావనతో హేతువాదులు ఏకీభవిస్తారు. అలవాట్ల మీద, ఆచారాలమీద, గణతంత్ర వ్యవస్థల ఎదుగుదలపైన ఎంతో కృషి సలిపిన దేవీప్రసాద్ చటోపాధ్యాయ పేరు 'ఋషు లెవ్వరు' అన్న అధ్యాయం చివర యిచ్చిన రిఫరెన్సులో ఒక్కచోటే కనపడుతుంది. 'లోకాయత'లాంటి రచనలు చేసిన దేవీప్రసాద్ పుస్తకాలతో పరిచయమున్నవారికి యిది ఆశ్చర్యం కలిగించక మానదు.

సీత వ్యవసాయక దేవత. రాముడు ఇంద్రుడికి కొత్త కూర్పు; అన్న అంశాలను చెప్పేటప్పుడు, ఆర్మేనియన్లు ఉక్కును ఉత్పత్తి చేశారని చెప్పేటప్పుడు ఆర్యుల గురించిన అవసరమైన వివరణకూడా లేకపోవటం కొట్టొచ్చినట్టు కనపడుతుంది. ఎన్నో చోట్ల జియాలజీ గ్రంథాలను ఆధారం చేసుకు సాగిన పీఠికలో ప్రాణికోటి ఆవిర్భావం జరిగినప్పటి నుండి మానవుని ఆవిర్భావంవరకూ గడిచిన చరిత్రను స్పృశించకపోయినా, కనీసం ఉత్తర భారతదేశానికీ దక్షిణ భారతదేశానికీ మొదట సంబంధమే లేదని వున్న రుజువులను ఎందుచేతనో చెప్పలేదు. 'టెతిస్' అనే సముద్రం దక్షిణహిందూదేశం (లంకతో సహా) ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా భూభాగాలను ఉత్తర భారతం తక్కిన భూభాగాన్నించి విడదీస్తూ వుండేదని జియాలజిస్టులు చెపుతారు. దక్కను పీఠభూమి ప్రాంతం, ఆఫ్రికా మరికొన్ని యితర భాగాలు 'గోండ్వానా లాండ్' అని పిలవబడేవట! హిమాలయాలు పైకి పొడుచుకు రావటంతో టెతిస్ మహా సముద్రం అంతరించిందనీ, అంతకు పూర్వపు ఆర్యులే తమను తాము రక్షించుకునే ప్రయత్నంలో 'ఆర్యనమ్ విజో' అనే ప్రాంతానికి వెళ్ళారనీ, అదే నేటి 'అజర్ బైజాన్' కానీ 'ఆర్మేనియా' కానీ అయివుండవచ్చునని కొందరంటారు. ఇందు గురించిన వివరణ ఈ పీఠికలో లేకపోవటం పాఠకుడిని అనంతమైన సందేహాల్లోకి నెట్టివేస్తుంది. ఏదేమైనా ఉత్తరాపథాన వున్న ఆహారోత్పత్తి వ్యవస్థలోని మనుషులకు మధ్య జరిగిన పోరాటాలు యీ రకంగా చిత్రీకరించబడి వుంటాయని వూహిస్తున్న శ్రీ నార్ల సత్యానికి దగ్గరగా వున్నారని అనిపిస్తుంది.

పీఠికను ముగించబోతూ (పేజి 169) సీతారాము లిద్దరిలో చేయెత్తి నమస్కరించదగు వ్యక్తి రాముడు కాదు, "సీత.... సీత.... ముమ్మాటికి సీత" అంటున్న శ్రీ నార్లవారిని హేతువాదిగా తీసుకోవాలో, రామభక్తుల్ని మాత్రమే నిరసించే సీత భక్తునిగా తీసుకోవాలో అర్థం కాదు. దీనితో ఏ 'కృష్ణా కల్ట్' ప్రభావం లోనో యిప్పటికే పడివున్నవారు మరో క్రొత్త 'సీతా కల్ట్'ను ప్రారంభిస్తే ఆశ్చర్యమేమీ లేదు. దీనినుంచి పరిరక్షించబడటానికి పాతికేళ్ళ కిందటి హేతువాదుల సాహితీ ఆయుధాగారాల వేపు మళ్ళీ మళ్ళక తప్పదేమో!

—డా. పరుచూరి రాజారాం

జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# మనం మనం ఒకటి

శ్రీసుభా

విశాలరావుకి మళ్ళీ ట్రాన్స్‌ఫర్ వచ్చింది. ఈ సారి మరో పల్లెటూరు బదిలీ అయ్యింది. ఉద్యోగంలో జేరి ఐదేళ్ళు కాలేదు. ఆంధ్ర దేశంలో యిరవై వూళ్ళు తిరగడం జరిగింది. ఏ ఊళ్ళో అయినా ఒకేరకం మనుషులయినా ఒకొక్కక్క ఊళ్ళో 'వీళ్ళు మనుషులేనా' అని ఆశ్చర్యం, ఆ పైన 'వీళ్ళేం మనుషులని' నిరాశా, ఇంకాపోతే 'వీళ్ళు మనుషులు కాదని' విరక్తి—అలా అలా ఎన్ని అనుభవాలు—ఎన్ని భయంకరానుభవాలు....విశాలరావు నావలో గోదావరి దాటి కోటిపల్లి రేవులో దిగాడు....అక్కడి నుంచి బస్‌లో రామచంద్రపురం వెళ్ళాలి....రామచంద్రపురంనుంచి పది మైళ్ళు, యింకా దూరమేమో రాయవరం....

చెట్టుకింద నిలబడ్డాడు....అతనిలాగే ఎంతో మంది బస్‌కోసం యెదురుచూస్తున్నారు.... విశాలరావు ఆ జనంలో గుర్తుపట్టాడు—వియ్యపురాళ్ళ జీళ్ళు కొనుక్కుంటూన్న రిటైర్డు తాహసిల్దారు రామానుజంగారిని.... పక్కన భార్యా పిల్లలూ వున్నారు.

విశాలరావు రామానుజంగారి దగ్గరకు వెళ్ళి "నమస్కారం సార్!" అన్నాడు.

రామానుజం విశాలరావుని చూసి ఆశ్చర్యం ప్రకటించి "ఎక్కడికి ప్రయాణం?...." అన్నాడు.

"రాయవరం ట్రాన్స్‌ఫర్ అయ్యిందండీ."

"మళ్ళీనా?"

"అవునండీ!"

"ఎన్ని బదిలీలయ్యా నీకు. నువ్వు క్రితం జన్మలో పిల్లివయి వుంటావ్. అందుకే యిలా తిరుగుతున్నావ్...." నవ్వుతూ అన్నాడు రామానుజం.

"మన చేతుల్లో లేదుకదండీ...."

"ఈసారి ఏం చేశావ్? మళ్ళీ ముక్కుకి సూటిగా పోయావా?"

"అవును. అమలాపురంలో రెండు వర్గాలు దెబ్బలాడుకున్నాయి....దెబ్బలు తిన్న హరిజనుల పక్షాన న్యాయం మాట్లాడాను...."

"అర్థమయ్యింది."

"ఏం అర్థమయింది సార్...."

"పక్షులు ఒకచోట నిలకడగా వుండలేవు. అవి స్వేచ్ఛాజీవులు. అలానే మంచివాళ్ళు ఒకచోట స్థిరంగా వుంటే జనానికి యిబ్బంది.... అంతేనా?"

"ఏమో సార్....ఒకొక్కక్కసారి యీ ఉద్యోగం రిజైన్ చేసి ఇంటికి పోయి వ్యవసాయం చేసుకోవాలనిపిస్తుంది. ఎన్ని చట్టాలు, యెన్ని జీవోలు, యెంతమంది నాయకులని మనకి! యింత మందీ మార్బలం వున్నా ప్రజల్లో అరాచకం పోవటంలేదు. ప్రజలకి గవర్నమెంటు అంటే పెళ్ళాంకన్నా లోకువయింది....అందులో పోలీసు ఇన్‌స్పెక్టర్లంటే మరీనూ. కొట్లాడుకోవద్దంటే కోపం....అసలీ లా అండ్ ఆర్డర్ శాఖని ఎత్తేస్తే జనం తన్నుకోవడం మానేస్తారేమో" విసుగ్గా అన్నాడు విశాలరావు.

"అవును. మిమ్మల్ని చూస్తే మరిన్ని రాళ్లు లేస్తాయి. వాళ్ళు తన్నుకొంటూంటే వాళ్ళని తన్నుకోవద్దని మీరు తన్నులు మొదలుపెడతారాయే!"

"పోలీసువాళ్ళ బతుకులు హీనం సార్.... యిదివరకు చదువుకోనివాళ్ళూ, అట్టడుగు

జనాభా దెబ్బలాడుకునేవారు. ఇప్పుడు మేధావులూ విజ్ఞులూ తన్నుకుంటున్నారు. ఎం.ఏలూ, పి. హెచ్‌డీలూ, లక్షాధికార్లూ రోడ్ల మీద పడ్డంతో, బి. ఏ. మాత్రం చదువుకొన్న నాలాంటి ఇన్‌స్పెక్టర్‌గాడు వాళ్ళకి అంటరానివాడుగా కనిపిస్తున్నాడు....అందుకే మేం తన్నులు తింటున్నాం."

రామానుజం నవ్వేశాడు.

"మీరు నవ్వుతారుసార్! మీకేం? మీరంతా కోర్టుల్లో, ఆఫీసుల్లో కూర్చుని చట్టాలు చేస్తారు. ఆ చట్టానికీ, జనానికీ మధ్య చచ్చేది మేము........"

రామానుజం తలూపి నవ్వేసి, "మీ ఇన్‌స్పెక్టర్ల సంగతెందును చెబుతావ్....గవర్నమెంటులో మీ అంత పక్షపాత వైఖరి చూపించేవాళ్ళూ, కరప్టివ్ నేచర్ వున్నవాళ్ళూ కాగడా వేసి వెదికినా కనబడరు."

"మీ రెవరూ మా దగరకు రాకండి సార్! ....తన్నుకోండి సార్....అప్పుడు మేం ఏమవుతాం? అలా ఆలోచించండి సార్?"

"సరే....బస్ వస్తోంది....రాయవరం చిన్న ఊరు అయినా గట్టి ఊరు అని విన్నాను....జాగ్రత్త!... ....అక్కడ గొడవలేం తెచ్చుకోకు...."

"మీ ఆశీర్వాదం వుంటే చాలండి."

"ఏ పరిస్థితిలోనూ దిగజారకు....నీకు చిన్నప్పుడు చదువు చెప్పిన గురువు యిచ్చే ఆశీర్వాదం యిదే...."

విశాలరావు బస్ ఎక్కాడు.

ర ర ర

రాయవరం చిన్న ఊరు....పొడుగాటి బజారు....డాబాయిల్లు పెంకుటిళ్ళు....ఊరు చివర్న ఆఫీసు....విశాలరావు చార్జి తీసుకున్నాడు....స్టాఫ్ అంతా విశాలరావుకు సెల్యూట్ చేసి నిలబడ్డారు.

ఆ మధ్యాహ్నం హెడ్‌కానిస్టేబిల్ రాఘవులు ఆ ఊరి గురించీ ఆ ఊళ్ళో వున్న పెద్దమనుషుల గురించీ కథలుగా మొదలు పెట్టాడు....

"డిటేయిల్డ్‌గా చెప్పు."

హెడ్ నసుగుతూ పలుకుబడి వున్న రెడ్ల గురించీ, కమ్మవారి గురించీ, బ్రాహ్మల గురించీ చెప్పి వాళ్ళ పేర్లతో తయారయిన ఓ కాగితం విశాలరావు టేబిల్ మీద పెట్టాడు.

"నీ పేరు?"

"రాఘవులు...."

"నువ్వెంతకాలంగా ఈ రేంజ్‌లో వుంటున్నావ్?"

"నాలుగేళ్ళబట్టి."

విశాలరావు మాట్లాడలేదు.

ఈసారి ప్రశ్నించడం రాఘవులు వంతు అయింది.

"అమ్మగారూ, పిల్లలూ ఎప్పుడొస్తారు సార్?"

"పెళ్ళికాలే దింకా."

"అమ్మగారూ నాన్నగారూ రారాండి."

"అన్నయ్య దగ్గర హైదరాబాద్‌లో వుంటున్నారు."

రాఘవులు మరో నిముషం ఆగి "వంట ఎలా సార్?" అన్నాడు.

"వండుకోగలను——"

"కోడి తెమ్మంటారా సార్"

"కావాలంటే చెబుతాను...."

రాఘవులు ఓ క్షణం బుర్ర గోక్కుని "ఇళ్ళు అద్దెకిచ్చినవాళ్ళు అడగమన్నారు సార్....మీరేవుట్లో...."

విశాలరావు ఆశ్చర్యంగా రాఘవుల్ని చూశాడు....

"మేం యేవుట్లం అయితే వాళ్ళ కెందుకట...."

రాఘవులు మాట్లాడలేదు.

విశాలరావు ఇన్‌స్పెక్టర్ కళ్ళతో రాఘవులు మొహంలోకి చూశాడు. రాఘవులు మొహంలో అబద్ధం ఛాయలు కదిలాయి. రాఘవులికి ఇన్‌స్పెక్టర్ కులంతో ఏం పని??

"అయ్యగారికి కులం లేదని చెప్పు!"

"రాఘవులు మళ్ళీ మాట్లాడలేదు.

నాలుగురోజుల తర్వాత విశాలరావుని చూడ్డానికి ఊళ్ళో పెద్దమనుషులు వీరయ్యచౌదరి, పెద్దిరెడ్డి, రామశాస్త్రి, నాయుడుగారూ వచ్చారు.







విశాలరావు అందరితో ఆప్యాయతగా మాట్లాడాడు. విశాలరావుతో వాళ్ళు మాటల మధ్యలో వాళ్ళు ఊరికి చేసిన సేవ గురించీ, వాళ్ళ పుట్టుపూర్వోత్తరాల గురించీ, వాళ్ళ ఆస్తుల అంతస్తుల వైనాలూ చెప్పారు. ఎవరికి వాళ్ళు గాంధీనీ ఏసుక్రీస్తునీ చంపి పుట్టినట్టు మాట్లాడారు. దేశంలో పాతుకుపోయిన కుళ్ళుని చూసి కళ్ళు వత్తుకున్నారు. అరాచకం హిమాలయాలయెత్తుకు ఎదిగినందుకు కుంచించుకుపోయారు. శాంతిభద్రతలు క్షీణించినందుకు వణికిపోయారు.

విశాలరావుకు వాళ్ళు శాంతి దూతల్లా కన్పించారు. అందుకే అలవాటయిన నాలుగుమాటలు చెప్పాడు.

"ఈ జిల్లా ముఖ్యంగా యీ తాలూకా కొట్లాటలకూ దొమ్మీలకూ ప్రసిద్ధి అని విన్నాను. మీలాంటి పెద్దలు అండదండగా వుంటే వాటిని నేను అరికడతాను."

"అలానే, తప్పకుండా" అంటూ, వాళ్ళు వెళ్ళిపోయారు.

కానీ మర్నాడు వీరయ్యచౌదరి ఒంటరిగా విశాలరావు ఇంటికి వచ్చాడు. ఏవేవో కబుర్లు చెప్పాడు. వాకిట్లో రామస్వామిచౌదరి ఫోటో చూసి అమితానందపడి "మీకు ఆయనగోరంటే

ఇష్టమా" అన్నాడు అదోలా.

"ప్రాణం...." అన్నాడు విశాలరావు.

ఆ తర్వాత డ్రాయింగ్ హాల్లో కట్టమంచి రామలింగారెడ్డి ఫోటో, తాపీ ధర్మారావుగారి చిత్రం, శంకరాచార్యుల పటం ఏసుక్రీస్తు రాతి ఫలకం వరసగా కన్పించాయి.

వీరయ్యచౌదరికి క్షణం ఏం తోచలేదు.

"మీకు పెళ్ళి కాలేదని విన్నాను...."

"అప్పుడే విన్నారా?" అన్నాడు నవ్వుతూ విశాలరావు.

వీరయ్యచౌదరికి ఆ నవ్వు అర్థంకాలేదు.

"మా అన్నగారి కూతురుంది....కట్నం రెండు లక్షలదాకా పెడతారు. మనం చుట్టాలయితే బావుంటుంది." లౌక్యంగా అన్నాడు చౌదరిగారు.

"చూద్దాం లెండి."

వీరయ్యచౌదరి వెళ్ళిపోయాడు. ఆ వారంలోనే పెద్దరెడ్డి, రామశాస్త్రి, నాయుడు విశాలరావు యింటికి విడివిడిగా వచ్చారు. ఎవరికి వాళ్ళు విశాలరావు ఏ గ్రూప్‌వైపు మొగ్గు చూపిస్తాడో ఆరా తీసి, ఏ అనూ పానూ దొరక్క లీలామానుషమూర్తి లీలలు అర్థంకాని గోపికల్లా తమ లోటుపాట్లనీ అవకతవకల్నీ బయటపెట్టుకొని, విశాలరావు నవ్వేస్తే, ఆ నవ్వే ప్రసాదమనుకొని పంచెలు ఎగదోసుకొంటూ వెళ్ళిపోయారు. వెళ్ళేముందు రాబోయే పంచాయితీ ఎలక్షన్లో ఎవరికి వాళ్ళు నిలబడుతోన్నట్టు చూచాయగా చెప్పి, విశాలరావు సహాయ సహకారాలు అర్థిస్తూ చేతులు కలిపి మరీ వెళ్ళారు.

ర్ ర్ ర్

రెండో ప్రపంచయుద్ధంతో అట్టుడికిపోయిన యూరప్‌లా వుంది వూరు....ఆటంబాంబు పడిన హిరోషిమా ముక్కుమీద వేలేసుకునేటట్టుంది వూరి పరిస్థితి.

అమెరికాయుద్ధ బాంబులకు వడిపట్టిన వియత్నాం వీరుల్లా ఊళ్ళో జనం కిందా మీద అవుతున్నారు.అమెరికా ప్రెసిడెంటుగా నిలబడి గెలవడం ఈజీగానీ ఆంధ్రదేశంలో పంచాయితీ ప్రెసిడెంటుగా నెగ్గడం బహుకష్టం.అమెరికాలో లేనన్ని కులాలు ఆంధ్రదేశంలో వున్నాయి. అమెరికాలో లేనన్ని నాటుబాంబులు ఆంధ్రాలో తయారవుతాయి. అమెరికా మొత్తం తయారు చేయలేనంత కత్తీసారా ఆంధ్రాలో ఒక ఊరు ప్రొడ్యూస్ చేస్తుంది!

ఓటుమీద కులం గుర్తు, ఓటుకు కత్తిపోటు సమాధానంగా యివ్వడం ఆంధ్రదేశంతో ఆనవాయితీ మరి!

ఎలక్షన్లంటే ప్రజలకు జాతర. పెద్దవాళ్ళకు అయోమయం. క్రిందవాళ్ళకు అవస్థ.

ఎలక్షన్‌రోజు దగ్గరపడింది!

విశాలరావు ఊళ్ళోకి అదనపు పోలీసుబలగం దింపాలనుకొన్నాడు. హెడ్‌క్వార్టర్స్‌కి లెటర్ వ్రాశాడు. ఫోన్ చేశాడు.

"నీ దగ్గర వున్న ఫోర్స్ చాలు" అన్నాడు పై అధికారి.

"చాలదు. టెన్షన్ ఎక్కువగా వుంది."

"కంట్రోల్ చేయకపోతే నువ్వు ఇన్ ఎఫిషెంట్‌వి."

విశాలరావు తల పట్టుకొన్నాడు.

"ప్రెసిడెంటుగా నిలబడుతూన్న పెద్దలూ-గుద్దులాడుకోవద్దు. ప్రజలూ—ఒకవేళ పెద్దలు గుద్దుకున్నా మీరు రెచ్చిపోకండి....పెద్దలు యేమయినా యేం జరిగినా లేళ్ళని తిన్న పులుల్లా సుఖంగానే వుంటారు. మీరు లేగదూడలు. మీరు గాయాలు చేసుకోవద్దు, జనం" అంటూ హితోపదేశం చేయాలనుకొన్నాడు.

కానీ అప్పటికే ప్రజలు వీరావేశంతో వీరభద్రుల్లా మారిపోయారు. ఊరు అగ్నిపర్వతం మీద శివతాండవం చేస్తోంది. కిరాయి మనుషులు గుళ్ళు మింగిన తుపాకుల్లా వెలిగిపోతున్నారు.

ర్ ర్ ర్

ఆ రోజు పదిగంటలవరకూ దొమ్ములాటలు జరిగాయి. రక్తం చవగ్గా రోడ్లమీద ప్రవహించింది. గెడ్డం పుచ్చుకొని బ్రతిమలాడితే వినని ప్రజలు దెబ్బలతో పోలీస్ స్టేషన్‌మీద



## రచయిత గురించి



పుట్టింది చింతలూరు - తూర్పుగోదావరి. పెరిగిందీ, చదివిందీ రామచంద్రపురం, కాకినాడలో. ఉద్యోగరీత్యా ఉయ్యూరు విజయవాడలో కొంత కాలం మకాం. 1960 నుంచీ రాస్తున్నారు. బహుమతి పొందిన నవల 'నవలోకం', ఐ.డి.పి.యల్, హైదరాబాద్‌లో ఉద్యోగం. భార్య ముగ్గురు పిల్లలు. ఇరవై ఏళ్ళ నుంచీ చుట్టూ సమాజం బహుముఖంగా వేస్తూన్న వెర్రి తలలు చూసి, కలం ఝళిపించడం జరుగుతోంది. "ఎవరికైనా రోగం ముదిరితే శస్త్ర చికిత్స అత్యవసరం. ఇది శాస్త్రం. కథలు వ్రాసే తొలిరోజుల్లో ప్రోత్సాహం ఇచ్చిన పత్రిక "జ్యోతి" మాసపత్రిక. అందుకే, ఊపిరి పోసిన పత్రిక ద్వారా వచ్చిన బహుమతి వెలకట్టలేనిది" అంటున్నారు శ్రీ సుభా.

పడ్డారు....

వీరయ్యచౌదరి, పెద్దిరెడ్డి, నాయుడు, రామశాస్త్రి అర్జీలు పెట్టుకొన్నారు. అరెస్టులు జరగాలన్నారు. ఆ రాత్రి విశాలరావు యింటికి వెళ్ళి వీరయ్యచౌదరి తలుపు తట్టాడు.

"ఆ రెడ్డిని బాగా లోతుగా యిరికించు. మళ్ళీ లేవకూడదు తెలుసా? మనవాడి వని చెబుతున్నాను. మర్చిపోకు. ఈ సహాయం చేస్తే నీకు సి.ఐ. ఇప్పిస్తాను."

తర్వాత పెద్దిరెడ్డి వచ్చాడు.

"కాల్చిపారేస్తాను వెధవల్ని....తెల్లారేటప్పటికి ఆ చౌదరిని బొక్కలో పెట్టు....ఆ ఏసురత్నంగాడు నెగ్గకూడదు. మనం మనం ఒకటని మర్చిపోకు...." విశాలరావు మంచంమీద వెయ్యిరూపాయలు పడేసి వెళ్ళిపోయాడు.

నాయుడు, రామశాస్త్రి వేరువేరుగా వచ్చారు. వాళ్ళూ చెప్పేదీ యెదటివాళ్ళని వలలో పడేయమని! వాళ్ళలో పగలున్నాయి. క్రోధాలున్నాయి. నలుగురూ పోటీ చేస్తున్నారు. నలుగురి కళ్ళలోనూ యేదో భయం. ఎలక్షన్లో నెగ్గలేమని ఆ వేళ....ఏసురత్నంగారు నెగ్గకూడదు. ఏసురత్నం ఏమిటి, తను తప్ప మరెవ్వరూ నెగ్గకూడదు....తను తప్ప మిగిలిన వాళ్ళంతా మట్టికరుచుకు పోవాలి! అదీ వాళ్ళ సిద్ధాంతం.

కానిస్టేబిల్స్ రాఘవులూ, సూరయ్యా స్టేషన్‌కి పరుగు పరుగున వచ్చారు. అసలు కథ, కాదు తెర వెనక జరిగిన దారుణ గాథ చెప్పారు.

ఏసురత్నాన్ని ఎవరో బాగా కొట్టారు....

ఏసురత్నం వెన్నలాంటి మనసున్నవాడు. హరిజనుడు. తాతలనాటి నుంచీ రెండెకరాల భూమినే నమ్ముకొని, దాన్ని పెంచుకోకపోయినా ఊళ్ళో మంచిని పెంచుకున్నమనిషి. ఏసురత్నం అంటే ఊళ్ళో యువతరం ప్రాణం పెడుతుంది....

కానీ ఏసురత్నం చావుదెబ్బలు తిన్నాడు.

మంచితనానికి, మిణుకు మిణుకుమని వెలుగుతూన్న మంచి తనానికి కత్తిపోటు!

విశాలరావు వెళ్ళేసరికి హాస్పటల్లో బెడ్ మీద ఏసురత్నం శిలువవాతబడ్డ ఏసుక్రీస్తులా వున్నాడు....గాడ్సే చేతి తుపాకీ గుండు దెబ్బలు తిన్న గాంధీ మహాత్ముడిలా మంచం మీద పడున్నాడు.

విశాలరావు అక్కడ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి స్టేషన్‌కి వచ్చాడు. పై అధికార్లకి ఫోన్ చేసి జరిగింది జరిగినట్టు చెప్పాడు....

అవతలి కంఠం కొంచెం సేపు తటపటాయించి, "పెద్దరెడ్డిని యిరికించకు. ఆపైన నీ యిష్టం...." అని ఫోన్ పెట్టేశాడు.

మరో గంటకి జిల్లా కేంద్రం నుండి రెండు ఫోన్లు వచ్చాయి. ఒకటి వీరయ్యచౌదరిగురించి, మరొకటి నాయుడు గురించి... ఇద్దర్నీ ముట్టుకోవద్దని.

"మరెవరిమీద కేసు పెట్టమంటావ్? వీళ్ళు నలుగురూ కలిసి ఏసురత్నాన్ని పొడిపించారు. వీళ్ళలో వీళ్ళకి మళ్ళీ మనస్పర్థలు. ఒకళ్ళ వెనక ఒకళ్ళొచ్చి యెదుటివాళ్ళ మీద కేసు పెట్టమంటున్నారు."

"ఓయ్ వెర్రిమొహం....అవి పొలిటిక్స్. ....అంతే....ఇంతకీ చౌదరిగారి అన్నగారు మన స్టేట్ మినిస్టర్. నాయుడుగారి మామగారు ఢిల్లీలో సెక్రటరీ. వాళ్ళమీద ఈగవాలిందంటే నువ్వు మన్యం పట్టిపోతావ్...."

విశాలరావుకి కోపం వచ్చింది. ఆవేశం వచ్చింది. ఆఖరికి రామశాస్త్రి గురించి కూడా గట్టి రెకమెండేషన్‌తోపాటు రామశాస్త్రి బుద్ధభగవానుడి అంశ అని హెచ్చరిక వచ్చింది.

"ఎవరిమీదా కేసుపెట్టకుండా ఏంచెయ్యను? నామీద పెట్టుకోవాలి కేసు."

"ఏం చేసినా సరే నీ ఇష్టం."

విశాలరావు నిద్రపోలేదు. కుర్చీలో కూర్చున్నాడు.

ఎర్రటి ఫోన్ దెయ్యంలా కనిపిస్తోంది. టేబిల్ మీద ఆఫీసు ఫైళ్లు అవయవాలుడిగిన మనుష్యుల్లా కదలిక లేకుండా పడున్నాయి.

బయట కారు ఆగిన చప్పుడు. హుటాహుటీగా జిల్లా కేంద్రంనుంచి నలుగురు పోలీస్ అధికారులు వచ్చారు. అందర్లూ హై రేంక్ ఆఫీసర్లు. విశాలరావు ఎదురువెళ్ళి సెల్యూట్ చేశాడు. చేతులు కట్టుకొని నుంచున్నాడు.

వాళ్ళు విశాలరావుని లోపలికి వెళ్ళమని ఆఫీసురూమ్ తమ ఆధీనంలోకి తీసుకొని నాలుగు గంటలు కేసునీ, కేసుతో సంబంధమున్న పెద్దమనుషుల జీవిత చరిత్రల్ని మరోసారి మననం చేసుకొని, ఆఖరికి కేసుకో తుది రూపం యిచ్చి రాఘవుల్ని పిలిచి రాఘవులచేత ఎఫ్.ఐ.ఆర్. తయారు చేయించారు.

రాఘవులు వణికే చేతుల్తో చిత్రగుప్తుడిలా తలొంచుకొని తప్పుల తడక వ్రాశాడు. అప్పుడు అధికార్లు విశాలరావుని ఆఫీసురూమ్‌లోకి పిలిపించి కేసు పూర్తిపాఠం చెప్పి, "దీని ప్రకారం కేసు నడుపు, తెలిసిందా....ఈ స్టేట్‌మెంట్ రేపు పోస్టులో పంపు. మేం వచ్చినట్టు ఎవరికీ తెలియకూడదు. జాగ్రత్త...." అని విశాలరావుని హెచ్చరించి అంబేసిడర్ యెక్కి దేవదూతల్లా యిట్టే మాయమయ్యారు.

రాఘవులు నెమ్మదిగా చెప్పాడు.

"ఏసురత్నం గంట క్రితం హాస్పిటల్లో చనిపోయాడు సార్" అని.

అదొక్కటే నిజం! విశాలరావు యేం మాట్లాడలేదు.

కేసు షీట్ చేతిలో వణుకుతోంది....మనసంతా చీకటి లాంటి బాధను తన్నుకువస్తోంది.


కేసు స్వరూపం మారిపోయింది! బ్రహ్మతిమ్మి అయ్యింది. జరగనివి జరిగాయి. జరిగినవి చరిత్ర కందకుండా పోతున్నాయి.

హంతకులు వీరయ్యచౌదరి, పెద్దరెడ్డి, నాయుడు, రామశాస్త్రి కానేకారు.

సోమేశ్వరం అనే ఇరవైఐదేళ్ళ యువకుడు....ఐదేళ్ళబట్టి నక్సలైట్ల జనాభాతో కలిసి తిరుగుతూన్న సోమేశ్వరం....

విశాలరావుకి సోమేశ్వరం చరిత్ర తెలుసు. ప్రతి స్టేషనులోనూ అతని గురించిన రికార్డు భద్రపరిచి వుంచారు.






సోమేశ్వరం ఎం. ఏ. పాసయి, ఉద్యోగం లేక తెలివితేటలు అన్నం పెట్టకపోగా నిరాశపడ్డ వ్యక్తి....చుట్టూ అన్యాయాలతో విసిగి వేసారి, దేశకాల పరిస్థితుల్ని చూసి కళ్ళల్లో మంటలు రేగితే, ఆ మంటలు గుండెలకు పాకితే, ఆ మంటలతో లోకాన్ని ప్రక్షాళనం చేద్దామనుకొని అడవులు పట్టిన వందలాది యువకుల్లో ఒకడు.

అవును....సోమేశ్వరంమీద రెండు ఖూనీ కేసులతో, పది దోపిడీలతో సంబంధంవున్నట్టు సమాచారం విశాలరావుకి పంపారు. వారం క్రితం సోమేశ్వరం కాకినాడ పరిసరాల్లో తిరుగుతోన్నట్టు అనుమానంగా వుందనీ జాగ్రత్తగా కాపు వేస్తూ వుండమనీ హెచ్చరిక వచ్చింది. సోమేశ్వరం వింతశక్తు లున్నట్టు రాయవరం రావడం, ఏసురత్నాన్ని ఆ రోజు పొడిచి పారిపోవడం, పారిపోయినట్టు కేసు చిత్రించడం అప్పుడు విశాలరావు వంతయ్యింది.

విశాలరావు ఫోన్‌వైపు చూశాడు. సోమేశ్వరం గురించి యెవరైనా ఫోన్ చేస్తే.... బావుండు ననిపించింది క్షణం. ఏ మినిస్టరో, ఏ అపోజిషన్ లీడరో, ఏ ఢిల్లీ నాయకుడో ఫోన్ చేస్తే....అసలు అలా జరుగుతుందా? జరగదు. సోమేశ్వరం మామూలు మనిషి. మామూలు మనిషికి కష్టం వస్తే పట్టించుకునే జనాభా వుండదు. దిక్కులేని శవాన్ని రాచ మర్యాదలతో సంస్కరించడం ఈ దేశంలో జరగని పని.

విశాలరావుకు మగతతో నిద్రపట్టింది. అది నిద్ర కాదు....ఆలోచన. ఆలోచనకాదు, ఆశల నిట్టూర్పు.

ఫోన్ మ్రోగింది.

విశాలరావు ఆత్రుతగా ఫోన్ ఎత్తాడు. "విశాలరావు స్పీకింగ్" అంటూ.

"నేనండీ...."

"అంటే...."

"ఏసురత్నంగారి అబ్బాయిని. నన్ను గాంధీ అంటారు."

విశాలరావు "ఓ" అని ఆ తర్వాత "సారీ

బ్రదర్, మీ నాన్నగారు పోయినందుకు నా బాధ్యతా లోపం కూడా వుంది. క్షమించు...." అనేశాడు.

"ఏం చేస్తాం సార్! బాధపడ్డం వరకే. అయినా ఈ దేశంలో రోజూ యిలాంటి హత్యలు యెన్ని జరగడం లేదంటారు. ఇంతకీ సార్...." గాంధీ కంఠం ఆగింది.

"చెప్పు. ఏమన్నా సహాయం కావాలా?"

"కాదు సార్. హంతకుడి ఆచూకీ తెలిసిందా సార్"

విశాలరావు క్షణం ఆగి "సోమేశ్వరం అని...."

అంతే చెప్పగల్గాడు కంఠంలోంచి మాట పెగలలేదు.

"సోమేశ్వరమా?"

"నక్సలైట్ లీడర్."

"కాదండి ఇన్‌స్పెక్టర్. ఇది అన్యాయం. మా నాన్నని అతను చంపడు. సోమేశ్వరం నా క్లాస్‌మేట్. మా నాన్న అతనికి ప్రాణం. అతని సంగతి నాకు బాగా తెలుసు. ఇది దొంగ కేసు సార్."

విశాలరావుకు గాంధీ ఎదురుగా నిలబడి సవాల్ చేస్తోన్నట్టుగా వుంది....తల వంచుకున్నాడు.

"అతన్ని వదిలేయండి సార్. దొంగ కేసులు పెట్టి మెరికల్లాటి కుర్రాళ్ళన్ని చంపకండి సార్. జరిగింది జరిగినట్టు కేసెట్టి—ఆ కేసులో యిరుక్కున్నది యెంత పెద్దోళ్ళయినా వాళ్ళని ఏరి పారేయండి సార్. సోమేశ్వరం అమాయకుడు. మీలా నాలా సోమేశ్వరం యువకుడు సార్. ఉద్యోగం దొరికితే, మీలా ఇన్‌స్పెక్టర్ అయ్యేవాడు. లేకపోతే నాలా స్కూల్‌మేష్టర్‌గా బ్రతికేవాడు. యువతరం, యిలా యువతరంమీద కత్తి గట్టడం అన్యాయం సార్.. మనం మనం ఒకటి సార్....!"

ఏసురత్నం కొడుకు ఫోనులో ఉద్వేగాన్నీ, ఉప్పెనలా ఆవేశాన్ని నింపి ఆకాశంనుంచి అశరీరవాణిలా వాక్కులు వినిపిస్తున్నాడు.

"నువ్వు చెబితే లాభంలేదు. ఏ పెద్దవాళ్ళ చేతో ఓ అరగంటలో తెల్లవారేలోపున ఫోన్ చేయించు. అంతేగానీ నీ నా రెకమెండేషన్‌తో అమాయకులు గానీ ఎవర్నీ గానీ రక్షించలేం. దోషుల్ని శిక్షించలేం" విశాలరావు నెమ్మదిగా అన్నాడు.

"అలాగే సార్! ప్రయత్నిస్తాను. ఓ గంట టైం యివ్వండి."

విశాలరావు తెల్లవారే వరకూ అదే కుర్చీలో అంతే ఆతృతతో, కూర్చున్నాడు. నిద్ర కాలేదు. గుండెల్లో రేగే మంటని అదిమి పట్టుకున్నాడు.

తెల్లవారింది! బాగా వెలుగూ వచ్చింది. కానీ ఫోన్‌కాల్ రాలేదు.

ఫోన్ రాలేదన్న బాధతో గుండెల్లో గుబులుతో కుర్చీలోంచి లేవబోయి—శరీరం లోపలి మానవత మందలింపుగా నెత్తిమీద మోదినట్టయి అదే కుర్చీలో కూలబడిపోయాడు విశాలరావు.

కళ్ళు ఎందుకో సోమేశ్వరం కోసం అన్నట్టుగా రెండు కన్నీటిచుక్కల్ని ఆఖరి వీడ్కోలికి గుర్తుగా వదిలాయి. అందుకే ఏమీకాని, ఎవరూలేని సోమేశ్వరం కోసం తన ఉద్యోగానికి రాజీనామా పత్రం వ్రాయడానికి కలం తీశాడు విశాలరావు. □

---

## స్వప్న సముద్రం

సముద్రం నిద్రిస్తే
ఆకాశం కలలోకొస్తుంది
గగనిండా చుక్కల్ని తురుముకుని
కళ్ళనిండా కాటుక రేఖల్ని దిద్దుకుని-
కల చెదిరినట్లు బెదిరితే
కలలోనే సముద్రం,
తలనిండా
యుద్ధ విమానాల రెక్కల్ని గుచ్చుకుని
సముద్రమైదానం మీద
కురుస్తోంది వికృతంగా ఆకాశం

—దేవిప్రియ

---




యూనివర్సిటీ పరీక్షలు అయిపోయాయి. విద్యార్థు లందరిలోనూ ఇళ్ళకు వెళ్ళాలనే తొందర. మెస్సులో భోంచేసి సామానులు సర్దుకోడానికి రూముకు వచ్చాను. ఎండాకాలమైనా యెందుకో చలి వేస్తోంది. రూములో లైట్ వేసి సిగరెట్టు వెలిగించుకున్నాను. టైము దాదాపు తొమ్మిదవుతోంది.

ఆకాశవాసు లెవరో భూలోకాన్ని తాళ్ళతో బంధించినట్లు సన్నని తుంపర ప్రారంభమైంది. ప్రొద్దున్నే తిరుపతి వదలి వెళ్ళిపోతాననుకుంటే ఎందుకో బాధగా వుంది. ఎం. ఏ. పూర్తి చేసిన యీ రెండు సంవత్సరాల కాలంలోనూ ఎన్నో అనుభవాలూ, హృదయంలో హత్తుకొన్న సంఘటనలూ, జీవితంలో మరచిపోలేని గుణపాఠాలు.